డియా నాదే అనుకో. యు మస్ట్ బి ప్రౌడ్ ఆఫ్ యువర్ హజ్బెండ్" అన్నారు మా వారు పెళ్ళి నుంచి తిరిగొచ్చిన్నాడు రాత్రి నా మొహం మీదికి సిగరెట్ పొగ వదుల్తూ.

ఆ సిగరెట్ నేను ఆఫర్ చెయ్యలేదు.

"మరి యిదేఁవిటి?" అన్నాను పొగ నుంచి తప్పించు కుంటూ.

"అదంతే" అన్నారు భగవద్గీత బోధిస్తున్న కృష్ణుడిలా.

అదేఁవిఁటో తరువాత ఆనందరావు చెప్పేడు.

లగ్నం అయ్యేవరకూ జలపాతంలా పారిన సిగరెట్లు మంగళ సూత్రధారణ అయిన మరుక్షణం ఠక్కున ఆగిపోయేయిట. ఈ సంగతి ఊహించని రాజు అక్షింతలు అందుకొని ఊర్లోకి షికారెళ్ళేట.

"యిడియట్ క్షణం కాలు నిలవదు. మనం వచ్చింది పెళ్ళికా? షికార్లకా?" అని తెగ విసుక్కున్నారట మా వారు. పోనీ వెళ్ళినవాడు వెంటనే వచ్చేడా? వస్తే కథేఁవుంటుంది. మా వారికీ ఆనందరావుకీ నాలిక పిడచకట్టుకుపోతోందిట. బుగ్గలు పీకేస్తున్నాయి. పెళ్ళికొడుకు కనిపించినా బావుణ్ను?

కన్యాదానం కూడా కాకుండానే కొంగు పట్టుకొని తిరిగే వీడెందుకు పనికివస్తాడు? ఆ అమ్మాయితో ఒకటే నవ్వులు, కబుర్లు, సిగ్గయినా లేదు యిదీ మా వారి అమూల్య అభి ప్రాయమే. అయితే ఎంతటి ఆపదలోనైనా ఆయన బుర్ర పాద రసంతో సమానంగా పరుగెడుతుంది.

"ఒరే ఆనందం" పిల్చేడు.

"ఓయ్" అని పలకడానికి నాలిక యెండిపోయిన ఆనంద రావు జాలిగా చూశేడు.

"ఒరే ఆనందం, నేనో మాట చెప్తాను విను. మనం యిలా సిగరెట్లు కాల్చం, సినిమాలు చూడం. పెళ్ళాన్ని పలకరించం అంటూ మనమీద మనమే ఆంక్షలు పెట్టుకుంటే ఇంక మనం బతకడం దేనికి? వట్టి వేస్ట్. అదుగో... మన మునసబుని చూడు. ఒక సిగరెట్టు లేదు, సరదా లేదు, పులుసు తాగిన పిల్లిలా మొహం పెట్టుకొని పగలంతా మనల్ని రాత్రి మరోకర్ని తినడం. ఛీ, ఛీ యింక... ఈ ప్రిన్సిపుల్స్ అంటావా... యివి మనం పెట్టుకున్నవే. మనం పెట్టుకున్నదాన్ని మనమే తీసేసు కోవచ్చు నిక్షేపంగా. అసలీ రూల్సు అనేవి అతిక్రమిం చడానికే అన్నాడో మహాను భావుడు. అదీ కాక మన లైఫ్ సిగరెట్ ఖరీదు చెయ్యదంటావా? అన్నారుట మా వారు.

ఆనందరావు ఏఁవీ అన్లేదు.

వెళ్ళి సిగరెట్లు కొనితెచ్చేడుట. అదీ కథ.

"హార్ట్ ఎటాక్ వచ్చేక కూడా సిగరెట్లు కాలుస్తున్నారంటే" మధ్యలోనే ఆపేసేడు రామ్మూర్తి.

యిసారి నిజంగా మహర్షిలా నవ్వేరు మా వారు.

మా మాఁవ. అంటే ఈవిడ బాబు. అతను సిగరెట్లు కాల్చలేదు సరికదా నేను ఈ గదిలో సిగరెట్ కాలుస్తే పక్కగదిలో వుండేవాడు ... "ఏవే అమ్మడూ.... అంతేనా.. ఆఖర్న ఏవఁ య్యేడు? హార్ట్ ఎటాక్ వచ్చి హరీమన్నాడు. నేను చైన్ స్మోకర్ని. నాకు యెటాక్ వచ్చింది పోయింది. ఎలా ఉన్నానో చూస్తున్నారు కదా ... ఇనప స్థంభంలా వున్నాను" అంటూ సిగరెట్ అంటించేరు.

**(జ్యోతి, దీపావళి 10.11.1979)**

# అందాలూ - అనుభవాలూ

**"ఏ** ప్లేస్ ఫరెవ్విరిథింగ్ ఎండ్ ఎవ్విరిథింగ్ యినిట్స్ ప్లేస్" అన్నది మా వారి సిద్ధాంతం.

అన్ని సిద్ధాంతాలూ మంచివే రాద్ధాంతాలు రానంత వరకు.

మల్లెపువ్వులా ముస్తాబై, ఇంద్రభవనం లాంటి ఇంట్లో ఇంద్రాణిలా కాలుమీద కాలేసుకొని కూర్చోవాలని ఎవరి కుండదు! (ఒక్క నీకూ, మీ బాబుకే తప్ప చుట్టూ మాసిన బట్టలు పేర్చుకొని మధ్యన చాకలాళ్ళలా కూర్చోవడం మీ హాబీ అని మా వారు ఉవాచించినప్పటికీ)

సంగతేవిటంటే...

మెట్లెక్కుతున్న మా వారి అడుగుల చప్పుడు వినగానే పిల్లలూ, జవాన్లు ఎక్కడి వాళ్ళక్కడ పారిపోయేరు పెద్ద పులిని చూసినచిల్లర జంతువుల్లా.

"ఆ సోఫాలో ఉన్నది గొంగళీనా? చిన్నిగాడా?" అన్నారు యింట్లోకి వస్తూనే.

అలవాటైపోయింది కాబట్టి అలాంటి మాటలు నన్నంత గాభరా పెట్టలేదు కాని, ఆ మాటల వెనుక వున్న చిరునవ్వుకి

మాత్రం నాకు మలేరియా లేకపోయినప్పటికీ వొణుకు ప్రారంభమైంది.

"చిన్ని గాడే" మూలిగేడు మా పెద్దవాడు పక్కగదిలోంచి. ఆయన ఎదుటపడి మాట్లాడే ధైర్యం ఎవరికీ లేదు. ఒక్క మా కుక్కకి తప్ప.

"అది గొంగళీ కాకపోయినా నువ్వు మాత్రం ఈ జన్మకి సీతా కోకచిలుక అవలేని గొంగళీవే" అన్నారాయన చిరుతనం లేని నవ్వుతో.

ఇలాంటి సమయాల్లో ఆయన చిరునవ్వుకి మైనారిటీ తీరిం దంటే నాకు ప్రాణం మీదికి వచ్చిందన్న మాటే.

"చూడూ"

నేను చూడలేదు.

నీడలా డ్రాయింగు రూములోకి వెళ్ళేను.

అప్పుడే తపస్సు పూర్తి చేసిన మనిషిలా బహు ప్రశాంతంగా ఉన్నారు. ఆ శాంతానికి నాలో వొణుకు పోయి పెరాలిసిస్ వచ్చేసింది. ఉరితీసేముందు ఇలాగే నవ్వు తారుట.

"ఆ సోఫోలోది గొంగళీ అయితే మడతపెట్టి లోపల పెట్టించు. చిన్నిగాడైతే యిద్దరు జవాన్ల చేత లోపల గదిలోకి మోయించు. క్విక్" ఆయన నవ్వు సీరియల్‌లా వస్తూనే వుంది.

"రండమ్మా" అని రమ్మనకుండా వచ్చినావిడతో అని, యింతకీ మనిద్దరికీ పెళ్ళైపోయింది అంటూ కుర్చీలో కూర్చు న్నాడు.

అప్పటికే పెరాలిసిస్ వచ్చిన నా ఒళ్లు. పడిపోబోయింది. నాకు సవతి వచ్చిందని కాదు. యితన్ని కట్టుకొని ఈవిడేం సుఖపడుతుందా అని.

"...అంచేత మనకి రింకిల్స్ వస్తాయన్న భయం అక్కర్లేదు.."

అమ్మయ్య. ఇది డైటింగ్ లెక్చరన్నమాట.

ఆ వచ్చినావిడ నా వేపు తిరిగి నవ్వుతూ, "మీ గురించి చాల చాలా విన్నాను" అంది.

"విన్నది చెడుపైతే అంతా నిజం" అన్నారాయన.

"మీవారి మాటలు వింటే కథలు మీరు రాస్తారా, ఆయన రాస్తారా అనిపిస్తుంది" అందావిడ.

"ఇద్దరం కాదు. కుక్కపిల్ల రాస్తుంది అనబోయి" చిన్నగా నవ్వేదు.

"ఇది ఇల్లేనా అని సందేహించకండి. ఇల్లనే అద్దె పుచ్చుకుం టున్నాడు యింటివాడు. బహుశా మేము రాకపూర్వం యిల్లే నేమో కూడా! అరె! యింకా నిల్చునే ఉన్నారా! ఆ కుర్చీలో కూర్చోకండి... చీర చింపేస్తుంది. మిగతా దేనిలో ధూళి తక్కువ, ఖాళీ ఎక్కువ వుంటే దాన్లో కూర్చోండి... ఆయన లెక్చరు సాగుతుండగానే, నేను సోఫాలో ఉన్న పుస్తకాలువగైరా సామాను గబగబా ఏరిటేబులు మీద పారేసి ఆవిడకిఖాళీ చేసేను.

సోఫాలో అంచున కూర్చుంది ఆవిడ.

అప్పుడు చూసేను ఆవిడ్ని తేలిగ్గా.

అందం, ఐశ్వర్యం అన్నీ ఉన్న మనిషిలా ఉన్నా, అప్పుడే ఏదో అతి ముఖ్యమైన వస్తువుని పారేసుకున్న మనిషిలా వెలితిగానూ, గాభరాగాను ఉంది.

"..... మా కున్నంతమంది జవాన్లు మరెవ్వరికీ ఉండరు. అయినా మా ఆవిడ యిల్లు యిలాగే ఉంచుతుంది. ఇండియన్ ఆర్మీ అంతా ఈవిడ కిచ్చినా, పాకిస్తాన్ నుంచి దుమ్ము, బర్మా నుండి బూజు తెప్పించి దేశం నలుమూలలా జల్లిస్తుందే తప్ప లాభం లేదు..." మావారి లెక్చర్లుయిస్తారు. నేను ఇవ్వను అంతే.

మా పిల్లలందరకీ బట్టలు .... పుస్తకాలు వగైరా పెట్టుకోవ డానికి బీరువాలూ, బట్టలు + జోళ్ళ స్టాండులు అవసరమైన వాటికంటె ఎక్కువే ఉన్నాయి. అయినా...

సోఫాల్లో పుస్తకాలు, కింద చెప్పులు.

ఓ కుర్చీల్లో పుస్తకాలు+బట్టలు, కింద చెప్పులే, అప్పుడప్పుడు స్లైట్‌లు, పెన్నులు ఎక్స్‌ట్రా.

మంచాల మీద పుస్తకాలు + యాస్ ట్రేలు.

కింద మామూలే.

తలుపుల మీద తువ్వాళ్ళు, బట్టలు.

పరుపుల కింద పాత ఉత్తరాలు, బట్టల షాపు కవర్లు.

ఇవి గాక ఇంటినిండా విసిరేసినట్టున్న విరిగిన బొమ్మలు, పాత డబ్బాలు, మూతలు, గాలిపోయిన బంతులు, ప్లాస్టిక్ పూసలు వగైరాలు మూలల్లోవి.

అసలు మా యింట్లో గనుక ఎవరైనా పది నిముషాలు కదల కుండా నిల్చుంటే, వాళ్ళ బుర్రమీద పుస్తకాలు, పెట్టి, భుజాలకి బట్టలు తగిలేస్తారు. ఇంటికొచ్చిన ఎవరైనా మా యింటిని లాండ్రీ కమ్ చెప్పుల షాపు అనుకుంటే, వాళ్ళ తప్పేంలేదు.

మరి నువ్వేం చేస్తున్నావు? సర్దుకోకూడదా? అన్న సందేహం ఎవరికైనా రావచ్చు. సహజం కూడా ఓసారి...

సోఫాలో వున్న పుస్తకాలన్నీ తీసి శుభ్రంగా అలమరలో సర్దేసిన ఐదు నిమిషాల్లో మా పెద్దవాడు వచ్చి "ఈ సోఫాలో పుస్తకాలేవీ?" అన్నాడు.

"నీ అలమరలో సర్దేశాను?" అన్నాను గొప్పగా, థేంక్స్ చెప్తాడేమోనని.

"అబ్బబ, నువ్వొకర్తివి యీ నీట్‌నెస్‌తో మమ్మల్ని తినేస్తున్నావు. సగం చదివి, ఎవరో ఫ్రెండు వస్తే అలా వేళ్ళేనో లేదో, మళ్ళీ వచ్చేసరికి మాయం అయిపోయేయి. ఎక్కడ పెట్టిన వస్తువు అక్కడ ఉంచరు కదా. అసలే టైములేక చస్తూవుంటే మళ్ళీ ఈ పుస్తకాల వేట ఒకటి. నీకంత నీట్‌నెస్ కావాలనుకుంటే నాకో గది పారే. నా యిష్టమొచ్చినట్లు ఏడుస్తాను" అని వాళ్ళ నాన్న కంటే ఎత్తు ఎగిరేడు.

"బావుందిరా నాయనా! మూడుగదుల ఇంటికి మూడు వందలు యిస్తున్న ఈ రోజుల్లో మనిషికొక గది యివ్వమంటే మీ నాన్న జీతంచాలదు. మరింక మనం పుస్తకాలే తినాలి అందా వనుకుని" "నెవర్ ఆర్గ్యూ విత్ ది చిల్డ్రన్" అన్న మావారి ఉపదేశం జ్ఞాపకం వచ్చి మానేశాను.

మరోనాడు... తలుపుల మీద, పరుపుల మీదున్న బట్టలన్నీ తీసి ఉతికించి చక్కగా బీరువాలో సర్దేను. ఓ పక్క బితుకు బితుకుమంటూనే.

నా బితుకు అర్థరహితం కాదు. ఆ సాయంత్రం "అమ్మా! ఈ తలుపుల మీది నా తెల్ల చీరేది? మొన్న ఓ పూటే కట్టేను. ఇంకో పూట కడదావఁనుకున్నాను. ఆ కిటికీ మీద నా పేంటు ఏది? రామచంద్ర ప్రభో! అది ఈవేళ సినీమాకి వేసుకుందామనుకుంటున్నాను. అన్నట్టు ఆ పరుపుకింద జాకెట్లు ఏవి? భగవాన్ ! ఈ అమ్మ కాదు కాని తినేస్తోంది. నాన్న జబ్బు ఈవిడకే అంటుకుంది ఈ మధ్య. నాన్నకైతే ఏదో తెలీదు. నీకూ తెలీదా? ఆ బట్టలు నిన్నేం చేశాయి? పోనీ మేము వచ్చే వరకు ఆగకూడదూ! అమ్మా! తల్లీ! నీకు అందరం కలిసి విడి విడిగానూ, జమిలిగా దణ్ణం పెడతాము. మమ్మల్నిలా బతకనీ, దయచేసి మా పుస్తకాల ఊసుకి, బట్టల జోలికిరాకు" అని యిద్దరు ఆడ + యిద్దరు మొగ వెరశి నలుగురూ కోరస్‌గా కథకళి చేశారు.

వీళ్ళచేత ఈ రోజూ తిట్లు తినడమా?

వారానికో, పది రోజులుకో మా వారి చేత చీవాట్లు తినడమా?

రెండోదే బావుంటుందనిపించింది.

మరింక ఆనాడే ఒట్టు పెట్టుకున్నాను. ఏవఁని? పీకపోయినా సరే. ప్రెసిడెంట్ ఆఫ్ ఇండియా మా యింటికి వచ్చిన సరే, ఇల్లు సర్దకూడదని, నేను తొందరపడి ఏ నిర్ణయం తీసుకోను. తీసుకుంటే మాత్రం తిరుగుండదు.

అంచేత మా యింటి సెటప్ కొన్ని సంవత్సరాలైన అలాగే ఉంటోంది.

అన్నట్టు చెప్పటం మరిచిపోయేను. ఆ వచ్చినావిడ కొత్తగా వచ్చిన ఇన్‌కమ్‌టేక్స్ ఆఫీసరు గారి భార్యట. మా వారికి పుస్తకాల షాపులో పరిచయమై నా గురించి విని (బీనాదేవిగారి మొగుడు గాడ్ని నేనే అని మా వారన్నప్పుడు తెల్లబోయిందట) నన్ను చూడ్డానికి వచ్చిందిట.

విచిత్రం నన్ను కూడా చూడాలనుకునేవాళ్ళు ఉన్నారన్న మాట.

మధ్యలో ఎందుకోగాని కొంచెం వెనక్కి చేరబడిన ఆవిడ స్టైత్ గుచ్చుకోవడంతో మళ్ళీ ముందుకు జరిగింది.

"మా అమ్మాయిలిద్దరూ మెడిసన్ చదువుకున్నారు" అన్నారాయన అదేదో ఘనకార్యం చేస్తున్నంత గర్వంగాను, అయితే అవిడకా స్టైత్ గుచ్చుకున్నందుకు కొంచెం ఎపోలజీ కూడా లేకపోలేదు ఆ గొంతుకలో.

అక్కడ కూర్చున్నానే కాని మనసంతా వంటింట్లో మాడిపోతున్న కూరమీద ఉంది. అక్కడికీ మాపెద్ద దానితో చెప్పేను కొంచెం చూడమని. కాని అది చూస్తూ ఊరుకుంటుందని మాత్రం గ్రహించలేకపోయేను.

జీవితాన్ని నాటకంతో పోలిస్తే మా వారికి ఓవర్ యాక్షన్ అనే చెప్పాలి. నేనెప్పుడూ డైలాగులు మర్చిపోతాను. అంచేత నేను ఊరికే ఉత్సవ విగ్రహంలా కూర్చోవడమే తప్ప ఎవరితోనైనా మాట్లాడ్డం మావారే. కాఫీ తెస్తాను అన్న మిషమీద లోపలికి వెళ్ళేను కూర ఏ స్టేజీలో వుందో చూడ్డానికి.

లోపలి గుమ్మంలో అడ్డేసింది మా చిన్నది "అమ్మ చాలా మంచిదిట. ఆ సోఫాలో కుషన్‌కిందున్న నా చీర తెచ్చిపెడుతుందిట" అంటూను.

"లాభం లేదు. నేను మంచిదాన్ని కాదు, ఆ సోఫాలో ఆవిడ కూర్చుంది. తప్పుకో అవతల కూర ఎలా తగలబడిందో అంటూ దాన్ని తప్పించుకొన్నాను.

మరెలా? ఈ వేళ ఫ్రెండ్సందరం ఒకే రకం చీరెలు కట్టుకుందావఁనుకున్నాం ఛీ! ఛీ! ఈ ఇంట్లో అతి చిన్న సరదా కూడా తీరదు. ఆవిడ ఎప్పుడు వెళుతుందో ఏఁవిఁటో! ఇంక ఈ వేళ నేను హాస్పిటల్‌కి వెళ్ళినట్టే. ఐదు నిమిషాలు ఆలస్యం అయితే మా అసిస్టెంటు అమ్మవారు పూనినట్టు గెంతుతాడు. చేతిలో వేప కొమ్మలే తక్కువ" అంటూ దాని గోల.

ఆ గోలదాటి రెండడుగులు వెయ్యలేదు. తోవలో తాటి చెట్టులా అడ్డంగా నిల్చున్నాడు మా సుపుత్రుడు. మమ్మీ, మమ్మీ నాన్న కుర్చీకిందున్ననా షూస్ తెచ్చి పెట్టావంటే వచ్చే జన్మలో నా చర్మంతో నీకు షూస్ కుట్టిస్తాను. ఏమైనా మిగుల్తే సాక్సు కూడా కుట్టిస్తాను అని గుమ్మానికడ్డంగా రెండు చేతులూ పెట్టి నిల్చున్నాడు.

"లాభం లేదురా అబ్బీ! అంతకంటే దాని చీర తేవటమే కొంత సులువేమో. దయచేసి నన్నొదలండిరా, అవతల అంత మాడు వాసన వస్తుంటే ఎవరూ కదలరేం? ఇప్పుడా కూర గనుక మీ నాన్న తింటే నా చర్మంతో చేట చేసి మిమ్మల్నందర్నీ చెరిగేస్తారు. తప్పుకోండిరా, జానపద సినిమాలో ద్వారం ద్వారం దగ్గరా రాక్షసుల్లాగా ఏవిట్రా మీరూ... అని వాడ్ని విడిపించుకొని వంటింట్లోకి పరిగెత్తేరు.

"మరైతే ఈ పూట యూనివర్సిటీ లేదు, ఏం లేదు. హాయిగా మార్నింగ్‌షోకి పోతాను" అంటున్న వాడి మాటలు వంటింట్లోకి వినిపిస్తున్నాయి.

మూకుట్లో ఏముందో తెలీలేదు, నల్లటి ముక్కలు మాత్రం పొగతో తేల్తున్నాయి. ఇంక నాకు ఎవర్ని తిట్టడానికి టైము లేదు, ఓపికా లేదు. అంచేత గబగబా కాఫీ కలిపి హాల్లోకి పరుగెత్తేను. ఆవిడ ఏమనుకుంటుందో నన్న ఆతృతతో. నా అదృష్టం కాఫీకి మూడో మనిషి లేకపోవడం. ప్రతి ఫస్టుకీ అర డజను కప్పులు కొన్నా వారం తిరిగేసరికి రెండింటికి చెవులు పోతాయి. మరో వారానికి మరో రెండు కప్పులు చెవుల్తో సహా పోతాయి.

నేను వెళ్ళే సరికి మా వారు, ఏ మాట కామాటే చెప్పు కోవాలి. మా ఆవిడ కుట్లు వగైరా చేతిపనులు బ్రహ్మాండంగా చేస్తుందండోయ్! షి ఈజ్ ఏ గుడ్ నీడిల్ ఉమన్ అంటున్నారు.

ఆ తరువాత ఆ మాటా ఈ మాటా మాట్లాడి ఆవిడ వెళ్ళిపోయింది. పోతూ పోతూ "మా యింటికోసారి తప్ప కుండా రండి" అని ఆహ్వానించింది.

మనింటికొచ్చిన ఎవరైనా మనల్ని వాళ్ళింటికి రమ్మనటం ఫార్మాలిటీ. అంతమాత్రాన పిలిచేరు కదా అని అందరిళ్ళకీ వెళ్ళటం నాకంత నచ్చదు.

మా వారు మాత్రం "పాపం ఆవిడంత అభిమానంగా పిలిస్తే వెళ్ళడానికి ఏడుస్తావేం? ఓ మంచి లేదు మర్యాదా లేదు. ఎప్పుడూ గుళ్ళో లింగంలా అలా యింట్లోనే కూర్చుంటావు. కాస్త సోషల్ లైఫ్ అలవాటు చేసుకో" అని నన్ను బైల్దేరదీసేరు. ఆడపిల్లల్ని కూడా రమ్మను పాపం, ఆవిడ చూస్తుంది అని వాళ్ళని కూడా కదిపేరు (మనలో మన మాట. మా వారికి ఆడవాళ్ళంటే అమిత గౌరవం. ఏ ఆడది పిల్చినా కాదన్లేరు).

"రండి, రండి" అంటూ గుమ్మంలోనే పలకరించేడు అతను, అదే మొదటిసారి చూడ్డం అయినా ఎంతో పరిచయం వున్నవాడిలా.

వాళ్ళ డ్రాయింగు రూంలో ఏది ఎక్కడ ఉండాలో అక్కడే ఉంది. ప్రతి వస్తువు అప్పుడు షోరూమ్‌నుంచి తెచ్చినంత కొత్తగా మెరుస్తున్నాయి. నడిస్తే మాసిపోతుందేమో అన్నట్టుగా నేలమీద కాశ్మీరు కార్పెట్.

షోకేస్ నిండా రకరకాల బొమ్మలు. అవి చక్కగా సర్ది ఉన్నాయి.

ఫ్లవర్ వాజ్‌లో వున్న పువ్వులు చెట్టున ఉన్నంత ఫ్రెష్‌గా ఉన్నాయి.

పావుగంట క్రితమే పెయింట్ చేసినంత తెల్లగా మెరుస్తున్నాయి గోడలు.

మేమంతా కూర్చున్నాం. కుషన్లు ఎక్కడ నలిగిపోతాయో అన్న భయం బయంగా. ఈ లోపున ఆవిడ కూడా లోపల్నించి వచ్చింది. అబ్బో! బాబు కూడా వచ్చాడే అంటూ మా లల్లూని అందు కోబోయింది. వాడు వెళ్ళ లేదు కాని "అమ్మా! ఆవిడ గ్రీన్ శారీ బావుంది కదూ?" అన్నాడు.

వాళ్ళిద్దరూ తెల్లబోయేరు.

వాడు నన్ను అమ్మా అని, మా వారిని నాన్నా అని అంటాడు.

"వాడికి మొన్ననే రెండు వెళ్ళేయి. యింట్లో పిల్లల కంపెనీ లేకపోవడం వల్ల అన్నీ పెద్దవాళ్ళ మాటలే వచ్చేస్తున్నాయి. తన

తోటి పిల్లల్తో వాడు ఏజ్ గేప్ ఫీలౌతాడు" అన్నారు మా వారు గర్వంగా.

"నా దగ్గరికి రావోయ్" అంటూ ఎత్తుకున్న అతని చేతిని వీడు కొంచెంసేపు పట్టుకొని "ఈ వాచీ హెచ్.ఎం.టిదా?" అన్నాడు.

అతను మళ్ళీ తెల్లబోయేడు.

ఒకసారి "కీ" యివ్వనా? అంటున్న వాడికతను ఆ వాచీ తీసి యిచ్చి మాతో మాట్లాడుతున్నాడు.

ఈలోగా ఆవిడ కాఫీలు, బిస్కట్లు తెచ్చింది. నాకు మా లల్లూని అతని దగ్గర్నుంచి తీసేసుకోవాలన్న కోరికని మొహమాటం ఆపేసింది. వాడప్పటికే ఆ వాచీకి 'కీ' యిచ్చేసి స్ట్రాప్ పీకేస్తున్నాడు. అతను నవ్వుతున్నాడే తప్ప తీసుకునే ప్రయత్నం చెయ్యడం లేదు.

వాడు ఆ వాచీ ఒకచేత్తో పట్టుకొనే అతని వొళ్ళోంచి దిగి "నాన్నా యాష్ ఇందులో వెయ్యి" అంటూ ఒక ఖరీదైన యాష్ట్రే తెచ్చి మా పక్కన పెట్టేడు.

వాడు ఆ యాష్ట్రేని కింద పడెయ్యనందుకు నేను, నా కూతుళ్ళు వెయ్యి దేవుళ్ళకి దండం పెట్టేం.

"మీ వాడు అద్వైతం కూడా మాట్లాడేటట్లున్నాడు" అన్నాడాయన లల్లూని పిలుస్తూ.

"విశిష్టాద్వైత్వం" కూడా అంటూ మా వారు నవ్వుతూ ఆవిడ తెచ్చిన ట్రేలోంచి ఓ కప్పు తీసుకున్నారు.

కప్పులు చైనావి కాబోలు బహు ఖరీదుగా కనిపిస్తున్నాయి.

ఆవిడ నాకు కాఫీ అందిస్తూ "నీకేం కావాలోయ్. పాలా? హార్లిక్సా?" అంది లల్లూని చూస్తూ.

"స్ట్రాంగ్ కాఫీ" అని డిక్లేర్ చేసి, అందీ అందని ఆవిడ ట్రేలోంచి ఒక కప్పు లాగేడువాడు.

కాఫీ ఆవిడ తెల్లని సిల్కు చీర మీదా, కప్పు నేలనీ వాడి వీపు మీద దెబ్బ ఒక్కసారే పడ్డాయి.

"ఏవైనా వీడికి ముద్దు తెగ ఎక్కువై పోయింది. భస్మాసురిడిలా తయారౌతున్నాడు" అంటూ మళ్ళీ ఎత్తిన మా పెద్దమ్మాయి చెయ్యి గట్టిగా పట్టుకుంది ఆవిడ.

రాబోతున్న ఏడుపును నోటిలోనే బిగబట్టేడు లల్లూ. కాని అది కళ్ళలోంచి కారుతోంది. ఆపిన దుఃఖానికి బుగ్గలు ఎరుపెక్కి, గుండెల్లోని రాని ఎక్కిళ్ళుగా మారిపోయింది. ఆవిడ గబుక్కున మా అమ్మాయి చెయ్యి వదిలి వొణుకుతున్న వాణ్ణి తీసుకొని లోపలికి వెళ్ళిపోయింది.

మాకేం చెయ్యాలో తోచక బిక్కమొహం వేసుక్కూర్చున్నాం.

"సారీ సర్ వుయ్ ఆర్ ఎక్స్ట్రీమ్‌లీ సారీ" అన్నారు మా వారు.

అతను ఏం అన్లేదు.

మరో పదినిమిషాలకి మా లల్లూ, ఆవిడ నవ్వుతూ యింట్లోంచి వచ్చేరు, "ఐలవ్‌యూ" అంటున్నాడు వాడు ఆవిడ మొహంలో మొహం పెట్టి.,

"ఆ మీ వాడు మంచి రొమాంటిక్ ఫిగరౌతాడు పెద్దయ్యాక" అని నవ్వుతూ వాడ్ని అందించింది ఆవిడ.

పదకొండో నిముషంలో బతుకు జీవుడా అనుకుంటూ లేచేం మేము.

మర్నాడు పొద్దున్నే వచ్చిన అతన్ని మేము గిల్టీగానే రిసీవ్ చేసుకున్నాం. ఎన్నడూ లేనిది మా వారు కూడా ఫ్రీగా ఉండలేక పోయేరు. మా డ్రాయింగ్ రూం అలవాటు ప్రకారం విజయవాడ ప్లాట్‌పారంలాగే ఉంది. నిన్నటి వాళ్ళ ఇల్లు జ్ఞాపకం వచ్చిన నేను సిగ్గుతో తలెత్తలేక పోయాను.

అతను మాత్రం చాలా హుషారుగా మాట్లాడేస్తున్నాడు. మధ్యలో మాత్రం తను కూర్చున్న కుర్చీలోంచి ఓ చిన్న బ్లేడు ముక్క తీసి అతి భద్రంగా తీసుకెళ్ళి కిటికీలోంచి విసిరేసి మళ్ళీ కూర్చున్నాడు.

అప్పుడు మా వారు నా వేపు చూసిన చూపుకి ఏ మాత్రం పవరున్నా, నేను భస్మం అయిపోయి బూడిదను కూడా మిగిలేది కాదు.

"మీరేం అనుకోకండి మా ఇల్లు యింతే. వుయ్ ఆర్ హెల్ప్‌లెస్" అన్నాను సగం సిగ్గుతో.

అతను వీక్‌గా నవ్వేడు. నవ్వి ఐ లవ్ అండ్ లైక్ దిస్ డిసార్డర్లీ నెస్. ఎందుకో తెలుసా? మా యింట్లో నేను టేబులు మీద పెన్ను పెడితే అది ఎన్నేళ్ళు గడిచినా అక్కడే వుంటుంది. నాకు విసుగొచ్చి తియ్యాలే తప్ప అరంగుళం కూడా కదలదు. పెట్టిన పుస్తకం పెట్టినట్టే ఉంటుంది. కనీసం అట్టయినా చిరగదు. టేబులు క్లాతులు నలగవు. అంత నీట్‌నెస్ భరించ

గలనంటారా?" అంటున్న అతని గొంతుకలో జీర మాకు స్పష్టంగా వినిపించింది. అంతలోనే సర్దుకొని "మీ లల్లూని మాకు యిచ్చేకూడదూ" అని, "ఏవోయ్! మా యింటికొస్తావా?" అంటూ వాడ్ని పైకెగరేశాడు.

"కంటే ఖర్మం గాని పెంచుకుంటే ప్రారబ్ధం అని వీడెందుకు మీకూ.. నిక్షేపంలాంటి మీ పిల్లలు..." అంటున్న నన్ను ఆపి "లేరు" అని పూర్తి చేసేడు తలదించుకొని.

**(యువ, దీపావళి 10.11.1979)**

# కాంట్ యు డేర్ డియర్?

**"…. వా**రి సమయం పదకొండు పది నిమిషాల నలభై సెకండ్లు అంటోంది పక్కింటి రేడియోలో ఎనౌన్సరు.

"ఆహాఁ ఏమి గొంతుకరా నాయనా, బీడీలు కాల్చే వాడి లాగ" విసుక్కున్నారు విశ్వనాథం గారు.

"టంగ్… టంగ్" పదకొండు గంటలు కొట్టింది తాలూకా ఆఫీసు.

"తాగుబోతు వెధవ, ఇప్పుడు తెలివొచ్చింది కాబోలు ఒంటి మీదికి, నయం పన్నెండు కొట్టలేదు" ఈసారి ఆయన విసుక్కున్నది తాలూకా ఆఫీసు ప్యూనుమీద గంటలు కొట్టినందుక్కాదు. పది నిమిషాలు ఆలశ్యం చేసినందుకు.

ఆయన అన్నం తిని చెయ్యి కడుక్కుంటూ వుంటే ఎవరైనా వాచీ కరెక్టు చేసుకోవచ్చును. పదకొండు గంటల ఐదు నిమిషాలు. ఆ తరువాత చుట్ట వెలిగిస్తే పదకొండు గంటల పదిహేను నిమిషాలు ఆయన ప్రతి పనీ నిమిషాల్లోనే చేస్తారు. అసలు పొద్దున్నే ఆయన మొహం కడుక్కునే నీళ్ళ చప్పుడు వినే వాళ్ళ పక్కింటి కోడి కూస్తుందని ఆ వీధి వారి నమ్మకం.

ప్రస్తుతం ఆయన భోజనం పూర్తిచేసి చుట్ట కాల్చే ప్రయత్నంలో ఉన్నారు. అగ్గిపెట్టె కోసం "సుభద్రా" అని పిలవబోయి తలెత్తారు. ఉలిక్కిపడ్డారు. అసలాయన యాభై ఏడేళ్ళ జీవితం లోనూ ఉలిక్కిపడ్డం యిది రెండోసారి. మొదటిసారి పెద్ద కొడుకు అమెరికా వెళ్ళిన వారంరోజులకి అతని దగ్గర్నుంచి ఫోనువచ్చినప్పుడు –

యిప్పుడు, నౌబత్ పహాడ్ నడచి వచ్చి ఎదురుగా నిల్చున్నా బహుశా అంత ఉలిక్కిపడి ఉండరు. కాని ఎదురుగా నౌబత్ పహాడ్ కాదు రెండో కొడుకు బాలరాజు.

ఆ యింట్లో అతనికి ఎదురుగా గాని, వెనుగ్గా కాని చుట్టు పక్కల గాని పనిపిల్లలతో సహా ఎప్పుడు ఎవరూ నిలబడరు. ఆయన ఇంట్లో ఉన్నంతసేపూ పిల్లలు బైటే ఉంటారు. "పెద్ద వాడికి ఫస్టు క్లాసు వచ్చిందిట అనో, చిన్నవాడికి డిబేటులో సెకండు వచ్చిందిట" అనో సుభద్రమ్మ గారు చెప్తే ఓహో అనే గాని "నేను ఫస్టుక్లాసులో పాసయ్యేను నాన్నా" అని కొడుకు చెప్పడం, చాలా సంతోషం అని తండ్రి సంతోషించడం ఆ యిల్లు ఎరుగదు.

అలాంటిది ఈ వేళ ఎదురుగా చిన్నవాడు. ఆ చిన్నవాడికి యిరవైరెండేళ్ళు. రెండేళ్ళ ఉద్యోగం, తండ్రి అంటే తగని భయం వున్నాయి. యివిగాక సువర్చలంటే ప్రేమ, ఆమెని పెళ్ళి చేసుకోవాలన్న కోరికా కూడా ఉన్నాయి. ఆ చివరి రెండే ప్రస్తుతం అతన్ని తండ్రి ముందు నిలబెట్టేయి.

"ఏవిఁటి సంగతి?" అన్లేదు తండ్రి.

సంగతేవిఁటో చెప్పలేదు కొడుకు.

పది నిమిషాలైంది.

విశ్వనాథంగారి చుట్ట సగం కాలింది.

మిగతా సగం కాలిపోతే ఆయన వెళ్ళి పడుకుంటారు.

ఎలా ప్రారంభించాలో తెలీడం లేదు కొడుక్కి.

కాని ఎలాగో ప్రారంభించక తప్పదని తెలుసు.

"మీతో ఓ ముఖ్యమైన విషయం మాట్లాడాలి" గొంతుక వణికినా మాట స్పష్టంగానే ఉంది.

కొడుకు తండ్రితో మాట్లాడే ముఖ్య విషయాలు రెండే. ఒకటి పెళ్ళి, రెండు పంపకాలు. సాధారణంగా మొదటి దాని తరువాతే రెండోది. మరంచేత ఇది పెళ్ళి బాపతే అయ్యిండాలి అనుకున్నారాయన. అయితే ఏ కొడుకు తండ్రితో ఎంత చనువున్నా సరే "నాకు పెళ్ళి చెయ్యండి నాన్నా" అని అడగడు నేను "ఫలానా అమ్మాయిని చేసుకుంటాను" అనే ఛాన్సుంది.

అర్జునిడి గురైనా ఎప్పుడైనా తప్పుతుందేమో కాని విశ్వనాథంగారి అంచనా మాత్రం తప్పదు. అంచేత కొడుకు చెప్పబోయే రెండో డైలాగు ఆయనకి తెలుసు.